క్లుప్తంగా

15 వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహించాలి



పరిశీలిస్తున్న ఎంఈవో

కెరమెరి: ఈనెల 15 వరకు సమ్మర్ క్యాంపు నిర్వహించాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. శనివారం మండలంలోని గోయగాం ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపు పరిశీలించారు. ప్రతీ రోజు ఆర్ట్ క్రాఫ్ట్, మ్యూజిక్, డ్యాన్స్, యోగా, కరాటే, గేమ్స్‌లో శిక్షణ ఇవ్వాలని సూచించారు. అధిక మంది విద్యార్థులు హాజరయ్యేలా చూడాలన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు



డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేస్తున్న ఎస్సై

కెరమెరి: మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని ఎస్సై మధుకర్ హెచ్చరించారు. శనివారం మండలంలోని సాకడ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేశారు.

చదువుతోనే భవిష్యత్



సన్మానిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

కౌటాల: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. పదిలో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులు దుర్గం వర్షశ్రీ, సాయికృష్ణను శనివారం మండల విద్యావనరుల కేంద్రంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువులో రాణించాలన్నారు. చదువుతో సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నానాజీ, రమేశ్, శివాజీ, సునీల్, సుమన్, బానయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



చేతిపంపు వద్ద ఎస్సై కొమురయ్య

పెంచికల్‌పేట్: సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోలీసులు మీకోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని పెంచికల్‌పేట్ ఎస్సై కొమురయ్య అన్నారు. శనివారం కోయచిచ్చాల గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేతి పంపును పరిశీలించారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే నేరుగా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయన వెంట గ్రామస్తులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

అంబలి పంపిణీ



పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్ చౌక్ వద్ద అంబలి పంపిణీ చేశారు. వేసవిలో ప్రజల దాహం తీర్చేందుకు ప్రతీ శనివారం అంబలి పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు ఉబేద్‌బిన్ యాహియా తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

లింగాపూర్: మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలో శనివారం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివరాం నాయక్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. నూతనంగా నిర్మిస్తున్న ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇల్లు గ్రామంలో ఒక్కరికీ కూడా మంజూరు కాలేదని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

వేసవి దుక్కులతో మేలు

- చీడపీడల నివారణ
- సకాలంలో విత్తనం విత్తుకోవచ్చు



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

ఆసిఫాబాద్‌రూరల్: వేసవిలో పంటలు లేని సమయంలో రైతులకు పనులు లేవనుకుంటారు. అసలు పొలం పనులు చేపట్టాల్సింది వేసవిలోనే. తొలకరి మొదలయ్యే వానాకాలం సీజన్‌కు ఇప్పటి నుంచే సమాయత్తం కావాల్సిన అవసరం ఉంది. వేసవిలో చేసుకునే పొలం పనులుతోనే పంటల ఎదుగుదల ఉంటుంది. అలాగే దిగుబడి అధికంగా వస్తుంది. వేసవిలో చేపట్టాల్సిన పనులపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచనలు ఇస్తున్నారు.

లోతుగా దున్నుకోవాలి..

దుక్కులు చేసుకోవడానికి సరిపడా తేమ ఉన్న పొలాల్లో ట్రాక్టర్లు, ఎద్దుల నాగళ్లతో లోతుగా దుక్కులు దున్నాలి. సుమారు 9 అంగుళాలకు తగ్గకుండా దుక్కులు దున్నుకోవాలి. లోతు దుక్కులు దున్నినప్పుడు నేలపై పొరల్లో ఉండే పురుగులు, తెగుళ్లను ఆశించే పురుగులు చనిపోయే అవకాశం ఉంటుంది. నేలలో దాక్కునే క్రిమికీటకాలు ఎండల బారిన పడి నశిస్తాయి. లోతు దుక్కులు చేసుకుంటే తొలకరిలో విత్తనాలు విత్తుకునే పంటలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

పశువులు, గొర్రెల మంద పెట్టడం..

గతంలో పశువులు ఎద్దులు, ఆవులు, బర్రెలు, గొర్రెలు, మేకలను రాత్రుళ్లు పొలంలో మందలు పెట్టేవారు. పశువుల మలమూత్రాలతో సేంద్రియ ఎరువుగా మారి పంటలకు ఉపయోగపడేవి. దీంతో రైతులకు ఎరువు ఖర్చు తక్కువగా ఉండేది. ప్రస్తుతం పశుసంపద తగ్గిపోవడంతో పంటలకు సేంద్రియ ఎరువు వాడకం తగ్గిపోతుంది. ప్రస్తుతం రైతులు వేసవికాలంలో పంట చేలు, పొలాల్లో గొర్రెల మంద లేదా బర్రెల మందను వారం పది రోజుల పాటు ఏర్పాటు చేసుకుంటే మంచి సేంద్రియ ఎరువు లభిస్తుంది.

కలుపు నివారణ..

వేసవి దుక్కులతో పంట పొలంలో కలుపు నివారించుకోవచ్చు. పొలంలో ఎక్కువగా తుంగ, గరిక, ఒలిపిడి, వంటి కలుపు మొక్కలతో రైతులకు నష్టం కలుగుతుంది. వేసవి దక్కులు దున్నుకోవడంతో వల్ల కలుపు మొక్కల వేర్లు కాయలు, దుబ్బలు పెకిలిపోయి బయటకు వచ్చి ఎండకి ఎండిపోతాయి. ఎండిన వేర్లు, కాయలు, దుంపలను ఏరివేస్తే మంచి ఫలితం ఉంటుంది.

అవగాహన కల్పించాలి



వేసవి దుక్కులతో కలిగే ప్రయోజనాలపై రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలి. గ్రామసభలు నిర్వహించి సాగులో తీసుకోవాల్సిన సలహాలు సూచనలు రైతులకు తెలియజేయాలి. అవగాహన లేక రైతులు నష్టపోతున్నారు.

– సాంబయ్య

మంచి ఫలితాలు

వేసవి దుక్కులతో వర్షాకాలంలో మంచి ఫలితాలు వస్తాయి. లోతుగా దుక్కులు దున్నుకునేందుకు ఆసక్తి చూపాలి. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. ఆధునిక పద్ధతులను పాటిస్తే మంచి దిగుబడి వస్తుంది.

– మిలింద్ (ఏవో)

దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు



లింగాపూర్‌లో..

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం 334 రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను పరిశీలించినట్లు ఎంపీడీవో అంజద్‌పాషా తెలిపారు. మెట్టపిప్రి. జోడేఘాట్, బాబేఝరి, సుర్దాపూర్, సావర్ఖెడా, గోయగాం గ్రామ పంచాయతీలకు సంబంధించిన లబ్ధిదారుల నుంచి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించామన్నారు. తహసీల్దార్ ప్రసాద్, ఏపీఎం జగదీశ్వర్ పాల్గొన్నారు.

లింగాపూర్: రాజీవ్ యువవికాసం పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. శనివారం మండల కేంద్రంలో ఎంపీపీఎస్ పాఠశాలలో రాజీవ్ యువవికాస దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. మండలంలోని జాముల్‌ధర, గుమ్నూర్(బి), కంచన్‌పల్లి, గుమ్నూర్(కే) గ్రామాల వారీగా దరఖాస్తులను పరిశీలించి, ఇంటర్వ్యూ నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ముఖేష్‌కుమార్, ఏపీఎం తిరుపతి, ఎంపీవో రజనీకాంత్, జూనియర్ అసిస్టెంట్ బాపురావు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: ఈనెల 5 నుంచి రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుధాకర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని బాలాజీ అనుకోడ రైతువేదికలో పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక ఉంటుందన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు హాజరు కావాలని కోరారు. 5న అడెపల్లి, డబ్బా గ్రామాలు, 6న బూరెపెల్లి, బాబాపూర్, ఖర్జవెల్లి, 7న బాలాజీ అనుకోడ, హేటిగూడ, 8న గూడెం, కోయపెల్లి, 9న దిందా, లంబాడిహెట్టి, 12న రవీంద్రనగర్1, రవీంద్రనగర్2, రుద్రాపూర్, 13న బాబాసాగర్, కోర్సిని, రణవెల్లి, 14న చింతలమానెపల్లి, గంగాపూర్ గ్రామాల దరఖాస్తులను పరిశీలన చేయడం జరుగుతుందన్నారు.

పెంచికల్‌పేట్: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు చేసుకున్న వారికి ఈనెల 5 నుంచి 8 వరకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎల్కపల్లి రైతువేదికలో దరఖాస్తుల పరిశీలన చేయనున్నట్లు ఎంపీడీవో అల్బర్ట్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5న చేడ్వాయి, పోతెపల్లి, గొంట్లపేట్, 6న కొండపల్లి, లోడుపల్లి, బొంబాయిగూడ, 7న కమ్మర్‌గాం, గుండెపల్లి, నందిగామ, మురళీగూడ, జిల్లెడ, పెంచికల్‌పేట్, 8న ఎల్కపల్లి, ఎల్లూర్ గ్రామాల్లోని దరఖాస్తుదారుల ధ్రువపత్రాలు పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

స్టడీ సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లు అందజేస్తున్న డిపో సిబ్బంది

ఆసిఫాబాద్ అర్బన్: బస్సులో మర్చిపోయిన స్టడీ సర్టిఫికెట్లను ఆసిఫాబాద్ డిపో సిబ్బంది బాధితురాలి కుటుంబసభ్యులకు అందజేశారు. శనివారం హైదరాబాద్ నుంచి ఆసిఫాబాద్ డిపోకు చెందిన లహరి బస్సులో వస్తున్న ప్రయాణికురాలు తన స్టడీ సర్టిఫికెట్లను మర్చిపోయి మంచిర్యాలలో బస్సు దిగింది. ఇంటికి చేరుకున్న ప్రయాణికురాలు కుటుంబసభ్యుల సహకారంలో బస్సు డ్రైవర్ మోహన్‌బాబును సంప్రదించారు. సర్టిఫికెట్లు ఉన్నాయని తెలుసుకుని ఆసిఫాబాద్ డిపోకు చేరుకున్నారు. డిపో సిబ్బంది వారికి సర్టిఫికెట్లు అందజేశారు. దీంతో డ్రైవర్‌కు, డిపో సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ పీవీ. రాజం, మహిళ కానిస్టేబుల్ విజయలక్ష్మి, ఏడీసీ సుధాకర్ పాల్గొన్నారు.

మొక్కలపై ప్రత్యేక దృష్టి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

- వనమహోత్సవానికి మొక్కల పెంపకం
- పర్యవేక్షణలో అధికారులు
- మండలంలో 3.38 లక్షల మొక్కల పెంపకం

వాంకిడి: రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవానికి మండలంలో మొక్కల పెంపకం ముమ్మరంగా చేస్తోంది. గ్రామాల్లో ప్రత్యేక నర్సరీలను ఏర్పాటు చేశారు. వచ్చే వర్షాకాలం నాటికి మొక్కలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. రహదారులకు ఇరువైపులా, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో నర్సరీలను ఏర్పాటు చేశారు. వేసవి ప్రారంభంలోనే లక్ష్యాలను గుర్తించి నర్సరీలలో బెడ్లు ఏర్పాటు చేశారు. విత్తనాలు నాటి మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. ఎండ వేడిమికి మొక్కలు చనిపోకుండా గ్రీన్‌షెడ్లను ఏర్పాటు చేశారు.

నర్సరీల్లో పెంపకం..

మండలంలోని 18 గ్రామ పంచాయతీల్ల నర్సరీలను ఏర్పాటు చేశారు. గ్రామ విస్తీర్ణం, జనాభా ఆధారంగా మొక్కల పెంపకం సామర్థ్యాలను నిర్ధారించారు. ఒకొక్క నర్సరీలో 10 వేల నుంచి 30 వేల వరకు మొక్కలను పెంచుతున్నారు. ఇళ్లలో నాటేందుకు పండ్లు, పూల మొక్కలను పెంచుతున్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్, ప్రకృతి వనాల కోసం మరిన్ని రకాల విత్తనాలను నాటారు. విత్తనాలు మొలకెత్తని వాటి స్థానంలో మళ్లీ విత్తుతున్నారు.

షెడ్‌నెట్‌లతో సంరక్షణ..

పెరుగుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. షెడ్‌నెట్‌లు ఏర్పాటు చేసి ఎండ నుంచి మొక్కలకు రక్షణ కల్పిస్తున్నారు. అలాగే ఉపాధిహామీ కూలీలతో నిత్యం నీరు అందిస్తున్నారు. వీటి నిర్వాహణ మొత్తం పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు.

ఎండిపోకుండా చర్యలు

గ్రామ పంచాయతీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలలో లక్ష్యానికి అనుగుణంగా మొక్కలను పెంచుతున్నాము. ఎండలకు, వడగాలులకు మొక్కలు ఎండిపోకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. పంచాయతీ, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశాలు నిర్వహించి సూచనలు చేయడం జరుగుతుంది.

– ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో

లోక కల్యాణార్థం పాదయాత్ర



జిల్లా కేంద్రానికి చేరుకొన్న అలంకార్ గణేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: దేశరక్షణ, లోక కల్యాణార్థం కోసం పాదయాత్రను చేపట్టినట్లు ఒరిస్సా రాష్ట్రం భువనేశ్వర్‌కు చెందిన అలంకార్ గణేశ్ తెలిపారు. పూరి జగన్నాథ్ నుంచి కాశీ, అయోధ్య వరకు సుమారు 1000 కిలోమీటర్ల వరకు పాదయాత్ర చేపడుతున్నట్లు పేర్కొన్నారు. తనకు దాతలు ఇచ్చిన విరాళాలను అనాథాశ్రమాలకు చెల్లిస్తానని పేర్కొన్నారు. ఇప్పటి వరకు గత 15 రోజుల నుంచి 400 కిలోమీటర్లు నడిచానని, మరో 700 కిలోమీటర్లు నడవాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా గణేష్‌కు స్థానికులు అల్పాహార, నిమ్మరసం ఇచ్చి స్వాగతం పలికారు.

గాలివాన బీభత్సం

కౌటాల: మండలంలో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన రాళ్ల వాన కురిసింది. ఈదురు గాలుల కారణంగా చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. వర్షం కురవడంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు వేడి నుంచి ఉపశమనం పొందారు.

చెక్కు అందచేత



చెక్కు అందజేస్తున్న జీఎం నరేందర్

రెబ్బెన: సింగరేణి ఉద్యోగం చేస్తూ మెడికల్ ఇన్‌వ్యాలిడేట్ అయిన ఉద్యోగి కూన తిరుపతికి శనివారం ఏరియా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ మచ్చగిరి నరేందర్ లంసం (ఏకమొత్తం చెల్లింపు) చెక్కును జీఎం కార్యాలయంలో అందచేశారు. ఖైరిగూడ ఓసీపీలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తూ కూన తిరుపతి మెడికల్ ఇన్‌వ్యాలిడేట్ కాగా వారసులకు ఉద్యోగం గానీ, ఎంఎంసీ (నెల వారీ జీవన భృతి)కి దరఖాస్తు చేసుకోకుండా లంసం మొత్తం కోరడంతో యాజమాన్యం ఆదాయపు పన్నును మొత్తాన్ని మినహాయించుకుని మిగిలిన రూ. 21,56,800ల చెక్కును తిరుపతికి అందచేశారు. విశ్రాంత జీవితాన్ని కుటుంబసభ్యులతో ఆనందంగా గడపాలని కోరారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డీవైపీఎం వేణు, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్తీర్ణత సాధించేలా ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న రెడ్డిమల్ల తిరుపతి

రెబ్బెన: సప్లమెంటరీ పరీక్షల్లో ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సింగరేణి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లో సింగరేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలకు చెందిన ఇంగ్లిష్ మీడియం పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడంపై అభినందించారు. అనంతరం పదో తరగతి తెలుగు మీడియంలో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులతో మాట్లాడారు. హాజరు శాతం తక్కువగా ఉందని ఉపాధ్యాయులు కరస్పాండెంట్ దృష్టికి తీసుకెళ్లారు. ఒకటి, రెండు మార్కుల తేడాతో విద్యార్థులు ఫెయిల్ అవ్వడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులతో పాటు ఉత్తమ ఫలితాల సాధన కోసం ప్రత్యేక తరగతులు బోధించాలని సూచించారు. డీవైపీఎం వేణు, ప్రధానోపాధ్యాయుడు రవితేజ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల్లో చెత్తాచెదారం



గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించకుండా రోడ్డుకు ఇరువైపులా, వాగు వద్ద డంప్ చేస్తున్నారు. కొందరూ చికెన్‌సెంటర్ నిర్వాహకులు వ్యర్థాలను మండలంలోని పులికుంట వాగులో పడేస్తుండడంతో ఆ ప్రాంతం దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు స్పందించి చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డుకు తరలించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

– రెబ్బెన

‘లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు’



ఆందోళన చేస్తున్న హత్తిని గ్రామస్తులు

దహెగాం: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని మండలంలోని హత్తిని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అర్హులైన నిరుపేదలను ఎంపిక చేయకుండా అనర్హులను ఎంపిక చేశారని ఆరోపించారు. గ్రామస్తులకు సమాచారం లేకుండానే గ్రామసభ నిర్వహించారని వాపోయారు. అధికారులు మరోసారి సర్వే చేపట్టాలని కోరారు. కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ సాయికి వినతిపత్రం అందజేశారు.

ఉద్యోగ అవకాశాలు మెరుగుపర్చుకోవాలి



పుస్తకాలను పరిశీలిస్తున్న ఏఎస్పీ చిత్తరంజాన్

తిర్యాణి: ఆదివాసీ యువత విద్యపై దృష్టి సారించి ఉద్యోగ అవకాశాలను మెరుగుపర్చుకోవాలని ఏఎస్పీ చిత్తరంజాన్ అన్నారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని పాత పోలీస్‌స్టేషన్ భవనంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రంథాయాలు విజ్ఞాన సంపదకు నిలయంగా నిలుస్తుందన్నారు. విద్యార్థులతో పాటు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు, సామాన్య ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గ్రంథాలయ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన సీఐ బుద్దె స్వామి, ఎస్సై శ్రీకాంత్‌లను అభినందించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దేవయ్య

దహెగాం: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏ గ్రేడ్ ధాన్యం రూ. 2320. బీ గ్రేడ్ రూ. 2300 రూపాయల మద్దతు ధర ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీవో వినోద్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతి గౌడ్, రాపర్తి ధనంజయ్, నారాయణ, ఏవో రామకృష్ణ పాల్గొన్నారు.